దసరా వైభవం.. పులకించిన భక్తజనం

జిల్లాలో దసరా ఉత్సవాలు వైభవంగా జరిగాయి. సర్వజనులకు సకల విజయాలు అందించే అమ్మవారిని దర్శించిన భక్తజనం పులకించిపోయింది. ఆయా ప్రాంతాల్లో శమీ చెట్టును ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలో శనివారం సాయంత్రం స్థానిక విశ్వనాథ ఆలయంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం నుంచి గోదావరి తీరం గౌతమేశ్వర ఆలయం వద్ద శమీ వృక్షం వద్దకు నిర్వహించిన ఉత్సవ విగ్రహాల రథాన్ని ప్రారంభించారు. అనంతం అర్చకుల మంత్రోచ్చారణాలతో కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ భాస్కర్, ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావులు కుటుంబ సమేతంగా జమ్మి చెట్టుకు పూజలు నిర్వహించారు. బెల్లంపల్లి తిలక్ క్రీడా మైదానంలో హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో రావణసుర ప్రతిమ దహనం చేశారు. బెల్లంపల్లి, చెన్నూరు ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, వివేక్ దంపతులు రావణాసుర వధ కార్యక్రమానికి హాజరయ్యారు. మందమర్రి సింగరేణి పాఠశాల మైదానంలో 'రామ్‌లీలా' కార్యక్రమానికి వేలాదిగా సింగరేణి కార్మిక, కార్మికేతర కుటుంబ సభ్యులు తరలివచ్చారు. చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ హాజరయ్యారు. కళాకారుల నృత్యాలు అలరించాయి. సప్తవ్యసనాల రాక్షస ప్రతిమను దహనం చేశారు.

- న్యూస్‌టుడే మంచిర్యాల అర్బన్, మంచిర్యాల విద్యా విభాగం, బెల్లంపల్లి పట్టణం, మందమర్రి పట్టణం


జమ్మి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ భాస్కర్ దంపతులు


మందమర్రిలో సప్తవ్యసనాల రాక్షస ప్రతిమ దహనం


మందమర్రిలో రామ్‌లీల వేడుకలకు హాజరైన జనం

ఆడిపాడి.. బతుకమ్మను కొలిచి..

మందమర్రి మండలం పొన్నారంలోని మాలకాలనీలో శనివారం రాత్రి బతుకమ్మ సంబురాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా బతుకమ్మ పాటలపై మహిళలు, యువతులు ఆడిపాడారు.

- న్యూస్‌టుడే, మందమర్రి పట్టణం


పొన్నారంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు, యువతులు


ఇందారం ఉపరితల గని

కనులవిందుగా గుట్టలు

జైపూర్ మండలం ఇందారం ఉపరితల గని, మందమర్రి ఏరియాలోని కేకే2 ఉపరితల గనుల మట్టి వెలికితీసిన తర్వాత ఇలా గుట్టలుగా పోశారు. వరుసలుగా పోసిన ఈ మట్టి కింద నాటిన చెట్ల పచ్చదనంతో ఆకట్టుకుంటున్నాయి. ఈ దారుల మీదుగా వెళ్తున్న వాహనదారులకు కనువిందు చేస్తున్నాయి.

- న్యూస్‌టుడే, కాసిపేట, జైపూర్



మందమర్రి కేకే2 ఉపరితల గని

సామాజిక లెక్కలు.. తొలగనున్న చిక్కులు

● సమగ్ర కుల గణనకు ప్రభుత్వం శ్రీకారం

లక్షెట్టిపేట, న్యూస్‌టుడే

సమగ్ర సామాజిక వర్గ (కుల) గణనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. జనాభా దామాషా ప్రకారం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఇతర వర్గాలకు విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ అవకాశాలు కల్పించేందుకు వీలుగా గణన చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇంటింటికి తిరిగి అన్ని కుటుంబాలకు సంబంధించి కులంతో పాటు ఆర్థిక, సామాజిక స్థితిగతులు, విద్య, ఉద్యోగం, ఉపాధి తదితర పరిస్థితులపై ఒక అంచనాకు వచ్చేందుకు సర్కారు కసరత్తు ప్రారంభించింది. ఇందుకు అనుగుణంగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో కులాల వారిగా జనాభా గణనకు అవకాశం చిక్కింది. కులగణన చేపట్టడం ద్వారా ఆయా వర్గాలకు దక్కనున్న ప్రయోజనాలపై 'న్యూస్‌టుడే' కథనం.



ప్రభుత్వ గణాంకాల ప్రకారం జిల్లాల వారీగా కులాల జనాభా వివరాలు
■ మొత్తం జనాభా ■ ఎస్సీలు ■ ఎస్టీలు ■ ఓసీ, బీసీ,మైనార్టీలు కలిపి

◆ రాష్ట్ర జనాభాలో అనధికారిక లెక్కల ప్రకారం కులాల వారీగా జనాభా శాతం పోల్చి చూస్తే ఓసీలు 16 శాతం, బీసీలు 45, ఎస్సీలు 18, ఎస్టీలు 10, ముస్లింలు 11 శాతంగా ఉన్నట్లు అంచనా. ఓసీల్లో రెడ్డి 6 శాతం, కమ్మ 3 శాతం, బ్రాహ్మణ, వైశ్య, తెలగ బలిజ 2 శాతం చొప్పున ఉండగా వెలమ 0.5, ఇతర అగ్రవర్ణాలు మరో 0.5 శాతంగా ఉంది. ఇక ముస్లింలలో ఓసీలు 6 శాతం, బీసీలు 5 శాతంగా ఉన్నట్లు అంచనా.

ఉమ్మడి జిల్లాలో ఎస్సీ, ఎస్టీల శాతం ఇలా...

ప్రభుత్వ అధికారిక లెక్కల ప్రకారం రాష్ట్రంలో సగటు ఎస్సీ, ఎస్టీ జనాభాతో పోలిస్తే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వారి జనాభా అధికంగా ఉండటం గమనార్హం. రాష్ట్ర సగటులో ఎస్సీల జనాభా 15.5 శాతంగా ఉంది. ఆదిలాబాద్‌లో 14 శాతం, మంచిర్యాలలో అత్యధికంగా 24.7 శాతం నిర్మల్‌లో 15.2 శాతం, కుమురం భీం జిల్లాలో 15.8 కలిపి సగటున ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జనాభాలో 17.8 శాతం ఎస్సీలు ఉండటం గమనార్హం. ఎస్టీల జనాభా తీసుకుంటే రాష్ట్ర జనాభాలో 9.1 ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. ఆదిలాబాద్ జిల్లాలో 31.7 శాతం, మంచిర్యాలలో 7.1, నిర్మల్‌లో 11.4, కుమురంభీం జిల్లాలో 25.9 కలిపి ఉమ్మడి జిల్లాలో సగటున 19.02 శాతం ఎస్టీలు ఉన్నారు. ఎస్సీ, ఎస్టీలు కలిపి మొత్తం జనాభాలో 36.82 శాతం ఉండగా మిగిలిన 63 శాతంలో ఓసీ, బీసీలు ఉన్నారు.

పథకాల రూపకల్పనకు అవకాశం

విద్య, ఉద్యోగాల్లో ప్రస్తుతం బీసీలకు 29 శాతం, స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పించడంపై వారు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం భావిస్తున్న బీసీ జనాభా కంటే కనీసం పది శాతం అధికంగా మొత్తం జనాభాలో 52 శాతం ఉంటుందని ఆయా వర్గాలు అంచనా వేస్తున్నారు. గతంతో పోలిస్తే ఓసీ సామాజిక వర్గం జనాభా గణనీయంగా తగ్గి తమ జనాభా పెరిగినట్లు బీసీలు అంచనా వేస్తున్నారు. తమకు జనాభా ప్రాతిపదికన ఫలాలు దక్కాలని పోరాటాలు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించే ప్రభుత్వ పథకాలు, రాజకీయ అవకాశాలకు మాత్రం లెక్కలు ఉపయోగపడే అవకాశముంది.

గణాంకాల్లో వ్యత్యాసాలు

ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే జనాభా లెక్కలతో పాటు, ఇతర సందర్భాల్లో ప్రభుత్వాలు అవసరమైన గణాంకాలు తీసుకున్నా కుల ప్రాతిపదికన సమగ్రంగా జనాభా గణన చేపట్టలేదు. దీంతో కొన్ని సామాజిక వర్గాల్లో తీవ్ర అసంతృప్తి నెలకొని ఉంది. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఓసీ వర్గాల్లో కులం ఆధారిత జనాభా శాతం ప్రభుత్వ అంచనాలతో పోలిస్తే ఒకటి, రెండు శాతం అటు ఇటుగా ఉన్నప్పటికీ బీసీల జనాభా విషయంలో మాత్రం గణనీయమైన వ్యత్యాసాలు ఉంటాయని ఆ సామాజిక వర్గం భావిస్తోంది. వందకు పైగా ఉప కులాలు ఉన్న తమ జనాభా ఎక్కువగా ఉన్నా సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా తమకు అందాల్సిన ఫలాలు అందడం లేదని వారి వాదన. ఉన్నత న్యాయస్థానం కూడా బీసీ జనాభా తేల్చాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. రాష్ట్ర సగటు ఆధారంగా బీసీల జనాభా ప్రస్తుత అంచనా కంటే ఎక్కువగా ఉండే అవకాశముంది. జిల్లాల వారీగా సగటు చూస్తే జనాభా ఎంత ఉండే అవకాశం ఉంది గణన తర్వాతనే తేలే అవకాశాలు కనిపిస్తున్నాయి.

వినియోగం లభ్యత ఎంత

● భూగర్భ జలాల వివరాలు ప్రత్యేక యాప్‌లో నమోదు


భూగర్భజలాల వివరాలు సేకరిస్తున్న అధికారులు

ఉమ్మడి జిల్లాలో భూగర్భజలాలపై ఆరా తీస్తున్నారు. ఏటా జిల్లాల వారీగా నీటి అవసరాలు, వినియోగం, లభ్యత తదితర వాటిపై కేంద్ర భూగర్భ జల సంఘం, రాష్ట్ర భూగర్భజల శాఖలు సంయుక్తంగా సర్వే నిర్వహిస్తున్నాయి. గతంలో మాన్యువల్‌గా నమోదు చేసి లెక్కలు తీయాల్సి వచ్చేది. ఈ సీజన్‌లో గ్రౌండ్ వాటర్ రిసోర్స్ ఎస్టిమేషన్ సిస్టమ్(ఐఎన్ జీఆర్ఈఎస్) యాప్‌లో నమోదు చేస్తున్నారు. గ్రామాల వారీగా భూగర్భజలాల లెక్కలను సంబంధిత అధికారులు తీస్తున్నారు.

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వ్యవసాయం

ఉమ్మడి జిల్లా సాధారణ వర్షపాతం 1150 మి.మీ.లు కాగా సగటున 900 మి.మీ.లకు పైగా కురుస్తోంది. సాధారణ వర్షపాతానికి చేరువలో వర్షం కురిస్తే ఆరు మీటర్ల భూగర్భజలాలు పెరుగుతాయని అధికారులు అంటున్నారు. ఏటా వినియోగం పెరుగుతుండటంతో వనరులు తగ్గిపోయే అవకాశాలున్నాయి. జిల్లాలో ఎక్కువ మంది భూగర్భ జలాలపైనే ఆధారపడాల్సి వస్తుంది. మిషన్ భగీరథ రాకతో ఉపరితల జలాన్ని ఎక్కువశాతం సద్వినియోగం చేసుకుంటున్నారు.

జిల్లాల వారీగా 2023లో భూగర్భ జలాల వినియోగం ఇలా ఉంది (హెక్టా మీటర్లలో)

■ వర్షపాతం ■ నీటి లభ్యత ■ వినియోగం

	ఆదిలాబాద్	కుమురంభీం	మంచిర్యాల	నిర్మల్
వర్షపాతం	1164	1154	1045	1056
నీటి లభ్యత	55,241	59,754	86,868	63,935
వినియోగం	19,730	9,510	24,489	23,282

◆ జిల్లా జనాభా అవసరం మేరకు తాగు నీటిని అందించేందుకు వీలుగా నీటి వనరులు ఉన్నాయి. అయినా అనేక గ్రామాలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాయి. గత ప్రభుత్వం ఉపరితల జలాలను వినియోగించుకునేందుకు జలాశయాల్లోని నీటిని తాగేందుకు వినియోగించుకునేందుకు మిషన్ భగీరథ పథకాన్ని ప్రవేశపెట్టింది. వర్షం నీటిని ఇంకించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది. గత నివేదిక మేరకు మంచిర్యాల జిల్లాలో నీటి వినియోగం ఎక్కువగా ఉంది. ఆ తర్వాత నిర్మల్‌లో ఉంది. నీటిని ఇష్టానుసారంగా వినియోగించుకోవడం, వృథా నీటిని భూమిలో ఇంకించే ప్రయత్నాలు చేయకపోవడంతో భవిష్యత్తులో నీటి సమస్య ఎక్కువయ్యే అవకాశం ఉంటుందని సంబంధిత అధికారి పుల్లారావు తెలిపారు. నీటి లెక్కల మేరకు సమస్య ఉన్న మండలాల్లో నీటిని ఇంకించే పథకాలను ప్రవేశపెట్టే అవకాశముందని తెలిపారు.

పరిహారం కాజేతకు కుట్ర?

కాసిపేట, న్యూస్‌టుడే

సింగరేణి పరిహారం అప్పనంగా దోచేందుకు పెద్దఎత్తున నగదు చేతులు మారుతున్నాయి. ఇదీ వరకు తిరస్కరించిన పట్టాదారులకు మళ్లీ పరిహారం ఇచ్చే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది.


కేకే-2 ఉపరితల గని

కాసిపేట శివారులోని 146 సర్వే నంబర్‌లో ఖస్రా పహాణిలో 412 ఎకరాలు ఉండగా ప్రస్తుతం ధరణి ఆర్ఎస్ఆర్‌లో 505 ఎకరాలు భూమి ఉన్నట్లు చూపిస్తుంది. ఇందులో ఇప్పటి వరకు కేకే-2 ఉపరితల గనిలో 150 ఎకరాలు ముంపునకు గురికాగా సంబంధిత రైతులకు పరిహారం అందజేశారు. 412 ఎకరాల నుంచి 150 ఎకరాలు ముంపునకు గురికాగా 262 ఎకరాల మిగులు భూమి ఉంటుంది. ఇందులో సోమగూడెం(కె) పంచాయతీ, లంబాడితండా(కె) పంచాయతీలోని వందల నివాసాలు, రైతుల వ్యవసాయ భూములు ఉన్నాయి. అయినప్పటికీ ఇంకా మిగులు భూమి ఉందని మళ్లీ పరిహారం పొందేందుకు అధికారులు అక్రమార్కులతో కుమ్మకై 40 ఎకరాలకు పైచిలుకు తుది నోటిఫికేషన్ జారీకి పాలనాధికారి కార్యాలయానికి ఫైల్ పంపించినట్లు తెలుస్తోంది.

మందమర్రి ఏరియాలోని కేకే-2 ఉపరితల గనిలో కాసిపేట శివారులోని 146 సర్వే భూములు ముంపునకు గురవుతున్నాయి. గని ఏర్పాటుకు ముందే ఏజెన్సీ గ్రామం కావడంతో 121 ఎకరాల భూములకు అప్పటి అధికారులు ముడుపులు తీసుకొని అక్రమంగా 42 మందికి పట్టాలు జారీ చేశారు. ఇదీ ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో ఆ పట్టాలు రద్దు చేశారు. అప్పటివరకు బాగానే ఉన్న కేకే-2 ఉపరితల గని ఏర్పాటుతో నాయకుల కన్ను ఈ భూముల మీద పడింది. రద్దు చేసిన పట్టాదారులు భూములు సాగు చేసుకుంటున్నారని వీరికి పరిహారం ఇవ్వాలని కొందరు నాయకులు కోరారు. దీంతో అర్హులుంటే పరిహారం ఇవ్వాలని అధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. 121 ఎకరాలకు పరిహారం ఇచ్చేందుకు అధికారులు వివరాలు నమోదు చేశారు. అందులో ప్రభుత్వ ఉద్యోగులు, 5 ఎకరాలకు పైచిలుకు ఉండి, చట్టానికి విరుద్ధంగా అసైన్డ్ పట్టాలను పొందిన వీరికి పరిహారం ఇవ్వొద్దని వ్యతిరేకత రావడంతో నిలిపివేశారు. మళ్లీ ఇప్పుడు వారికి పరిహారం ఇప్పించేందుకు అధికారులు కొందరు దళారులతో ఒప్పందం చేసుకొని కలెక్టరేట్‌కు ఫైల్ పంపించినట్లు సమాచారం. ఈ విషయమై తహసీల్దారు భోజన్ననను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా స్పందించేందుకు నిరాకరించారు.

◆ ఎకరానికి రూ. 7.20 లక్షల చొప్పున పరిహారం సింగరేణి ఇస్తుండటంతో కొందరు దళారులతో బేరసారాలు చేసుకొని పరిహారం కాజేసేందుకు కుట్రలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే పరిహారం చెల్లించిన 50 ఎకరాలకు పై చిలుకు భూమిని రెవెన్యూ అధికారులు హద్దులు చూపించలేదని సింగరేణి అధికారులు చెబుతున్నారు.


క్రీడాకారిణికి మిఠాయి తినిపిస్తున్న ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేష్

స్వాగతం పలికి.. మిఠాయి తినిపించి..

మంచిర్యాల క్రీడావిభాగం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయిలో మెరుగైన ప్రదర్శనతో ఆకట్టుకుని తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్న హ్యాండ్‌బాల్ ఉమ్మడి జిల్లా మహిళా జట్టుకు జిల్లా కేంద్రంలో ఘన స్వాగతం లభించింది. స్థానిక ప్రయాణ ప్రాంగణంలో ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేష్, కోశాధికారి అలుగువెల్లి రమేష్ రెడ్డి, ఉపాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి ఆయా క్రీడాకారిణులను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. జట్టు కెప్టెన్ రమ్య, కోచ్ అరవింద్‌ను ప్రత్యేకంగా ప్రశంసించారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గోనె శ్యాంసుందర్‌రావు, ఒలింపిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి అభినందనలు తెలియజేశారు.

కొత్త పొదుపు సంఘాలపై కసరత్తు

● జిల్లాలో 4వేల మందికిపైగా అవకాశం

మంచిర్యాల గ్రామీణం, న్యూస్‌టుడే

జిల్లాలో నిరుపేద కుటుంబాలకు చెందిన మహిళల కుటుంబాలకు ఆర్థికంగా సాయం అందించాలనే లక్ష్యంతో స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేస్తున్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతులకు, ఇంత వరకు సంఘాల్లో చేరని మహిళలను గుర్తించి స్వయం సహాయక సంఘాల్లో చేర్చేందుకు జిల్లావ్యాప్తంగా సెర్ప్ అధికారులు ముమ్మరంగా కసరత్తు చేస్తున్నారు.


పొదుపుపై చర్చిస్తున్న స్వయం సహాయక సంఘం మహిళలు

జిల్లాలోని గ్రామాలు, సంఘాలు, సభ్యుల వివరాలివే...

జిల్లాలోని మండలాలు	పంచాయతీలు	వీవోలు	మొత్తం కుటుంబాలు	సంఘాల్లో చేరిన కుటుంబాలు	సంఘాల్లో చేరాల్సిన కుటుంబాలు	తాజాగా చేరిన కుటుంబాలు
18	311	468	1,30,837	1,09,774	21,066	4,685

అర్హులైన వారికి అవగాహన కల్పించి సంఘంలో సభ్యురాలిగా చేరేలా సెర్ప్ సిబ్బంది కృషి చేస్తున్నారు.

ఉపయోగాలు ఇలా..

మహిళలు ప్రతి నెలా చేసే పొదుపు ద్వారా పేదరికం నుంచి బయట పడటంతోపాటు, స్వయంగా సంపాదించి తన కుటుంబాన్ని నడుపుకునే అవకాశం ఉంటుంది. బ్యాంకులు, స్త్రీనిధి పథకం ద్వారా మరింత ఆసరా కల్పించేందుకు రుణాలు అందించేందుకు ప్రభుత్వం సహకరిస్తుంది. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల్లో తొలుత స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకే ప్రాధాన్యం ఉంటుంది.

సభ్యుల చేరిక నిరంతర ప్రక్రియ

కిషన్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి, మంచిర్యాల

జిల్లావ్యాప్తంగా అర్హులైన గ్రామీణ, పట్టణ మహిళలు స్వయం సహాయక సంఘాల్లో చేర్చే ప్రక్రియ నిరంతరం కొనసాగుతుంది. ప్రతి ఏడాది 18 ఏళ్లు నిండిన యువతులతోపాటు ఇంతవరకు సంఘాల్లో చేరని మహిళలను నూతనంగా సభ్యత్వం ఇచ్చేలా కృషి చేస్తున్నాం. రోజురోజుకు మహిళల్లో పెరిగిన అవగాహన కారణంగా సంఘాల్లో సభ్యులుగా చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు.

సేల్స్‌గర్ల్స్ కావలెను
మంచిర్యాల జిల్లా క్యాతనపల్లిలోని భారత్ పెట్రోల్ బంక్‌లో పని చేయుటకు
సేల్స్‌గర్ల్స్/ బాయ్స్
వెంటనే కావలెను.
ఆకర్షణీయమైన వేతనం
సెల్: 99892 36655

Venkatarathna College of Education at Kurnool
B.Ed, M.Ed Management Seats are available. Batch: 2024-2026
Contact: 9866763155

పేరుకే వనం.. నిర్వహణ కనం

తాండూరు, న్యూస్‌టుడే

పల్లె ప్రకృతి వనాల నిర్వహణ లేకపోవడంతో రూ. లక్షలు వృథా అయ్యాయి. తొందరగా పూర్తి చేయాలనే అధికారుల ఒత్తిడితో ఆదరబాదరాగా తోచిన మొక్కలు క్రమ పద్ధతి లేకుండా నాటించారు. కానీ కాలక్రమేణా వాటి పర్యవేక్షణను గాలికొదిలేశారు. దీంతో ప్రస్తుతం అవి ఎందుకు పనికి రాని వనాలుగా మారిపోయాయి.

ఉమ్మడి జిల్లా పరిధిలో 1510 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 2020-21 ఆర్థిక సంవత్సరంలో ఉపాధిహామీ పథకం ద్వారా రూ.2 లక్షల వ్యయంతో పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ప్రకృతి వనాల్లో సంబంధం లేకుండా తీరొక్క మొక్కలు వృక్షాలుగా మారి అడవిని తలపిస్తున్నాయి. పల్లె ప్రకృతి వనాల నిర్వహణ రెండేళ్ల పాటు ఉపాధి హామీ పథకంలోనే కొనసాగింది. అందులోని మొక్కల సంరక్షణకు రోజుకు రూ. 245 చొప్పున ఒక కూలీని నియమించారు. వారికి రెండేళ్ల పాటు కూలీ డబ్బులు అందించారు. 2023లో వనాల నిర్వహణను గ్రామ పంచాయతీలకు అప్పగించారు. కానీ వీటి గురించి పట్టించుకోవడం లేదు. దీంతో కలుపు మొక్కలు పెరిగి అవి అడవులను తలపిస్తున్నాయి. గ్రామంలోని ప్రజలకు ఆహ్లాదాన్ని పంచడమేమో కానీ పాములు, విషపు పురుగులకు ఆవాసంగా మారిపోయాయి. పంచాయతీ స్థాయి మొదలుకొని జిల్లా స్థాయి అధికారుల వరకు అవి ఉన్నాయనే సంగతి మర్చిపోవడమే ఇందుకు కారణమనే వాదనలు వినిపిస్తున్నాయి.


ఇది కోటపల్లి మండలంలోని ఎర్రాయిపేట పల్లె ప్రకృతి వనం. ఇందులో నాటిన మొక్కలు ఎన్నడో కనుమరుగయ్యాయి. ఆది నుంచి నిర్వహణ లేకపోవడంతో మొక్కలన్నీ ఎండిపోయి నిరుపయోగంగా మారింది.

నమూన ప్రకటన
బహిరంగ ప్రకటన
ఇందుమూలంగా అందరికీ తెలియజేయునది ఏమనగా నా క్లయింటుయగు శ్రీ..................వా ....నివాసంగాశ్రీ.....................వారికి చెందినటువంటి గృహము ఇంటి నెం. మరియు ఖాళీ జాగా, ఈ క్రింది హద్దులు గల ఉత్తరం : ఇతరుల ఖాళీ జాగా, దక్షిణం : 20 ఫీట్ల రోడ్డు, తూర్పు: ఇతరుల ఖాళీ జాగా, పడమట:.........గారి ఇల్లు, పట్టణంలో గల దానిని కొనడానికి అగ్రిమెంట్ కుదుర్చుకున్నారు. మరియు అడ్వాన్సు కూడా ఇచ్చియున్నారు. ఇట్టి విషయంగా ఎవరికైనా అక్షేపణలు ఉన్న ఎడల వారం రోజులలోగా సాక్ష్యములతో సహా నన్ను సంప్రదించగలరు. ఆ తరువాత వచ్చే ఎటువంటి క్లయిమ్‌లు నా క్లయింటును బైండ్ చేయజాలవు.
సం/-
విజ్ఞతగల నిర్ణయం.
వివాదాలకు అతీతం.

25% డిస్కౌంట్ కలదు
లక్షల విలువైన స్థిరాస్తిని కొనేముందు సరైన నిర్ణయం తీసుకోవడం అవసరం. 'ఈనాడు'లో బహిరంగ ప్రకటన ఇవ్వడం ఎంతో సులభం.
GST 5% Applicable
వివరాలకు సంప్రదించండి :
Cell: 99590 97631
మంచిర్యాల: 80087 09946 కుమురంభీం: 91549 92560

శనగ విత్తనాలు గోధుమ విత్తనాలు


హిమ్మత్ నరేష్
బసంత్ ఆగ్రో
Ph. 9766368334, 8328455773

(c) eenadu

వంద కిలోమీటర్లు ప్రయాణిస్తూ.. క్రికెట్ ఆడేస్తూ



ఈమె పేరు సుచరిత. చెన్నూరు పట్టణానికి దగ్గరలోని ఓ గ్రామం నుంచి తెల్లవారుజామునే తన క్రికెట్ కిట్‌తో మంచిర్యాలబాట పడుతుంది. జిల్లా పరిషత్ బాలుర పాఠశాల మైదానంలో హెచ్‌సీఏ క్రికెట్ శిక్షణ కేంద్రానికి 6 గంటలకే చేరుకుంటుంది. దాదాపు తొమ్మిది గంటల వరకు ఇక్కడ సాధన చేస్తుంది. అబ్బాయిల బౌలింగ్‌లో బ్యాటింగ్ చేస్తూ వారికి సైతం బౌలింగ్ చేస్తుంది. రోజులో 5-6 గంటలు క్రికెట్ శిక్షణకు సమయం కేటాయిస్తుంది. డిగ్రీ పూర్తి చేసుకున్న సుచరిత రాష్ట్రస్థాయిలో పలు పోటీల్లో పాల్గొని మెరుగైన ప్రదర్శన ఇస్తోంది. జాతీయస్థాయిలో ఆడటమే లక్ష్యంగా కసరత్తు చేస్తోంది.

క్రికెట్‌పై ఆసక్తి.. మైదానం బాటపట్టి

మంచిర్యాల క్రీడావిభాగం, న్యూస్‌టుడే:

పేరుపొందిన నగరాల్లో తప్పితే ఇప్పటికీ అమ్మాయిలకు ఆటలేందుకు అనేవారు ఇంకా లేకపోలేదు. అందులో క్రికెట్ అంటే ఆమడదూరం ఉంచుతారు. కొంత మంది అమ్మాయిలకు క్రికెట్‌పై ఆసక్తి ఉన్నా తల్లిదండ్రుల కోసం తమ ఇష్టాన్ని పక్కన పెట్టడమో, లేక ఇతర ఆటలపై మొగ్గు చూపడమో చేస్తున్నారు. కానీ కొందరు మాత్రం దీనిపై మక్కువ చూపిస్తున్నారు. అమ్మానాన్నలను ఒప్పించి మరీ శిక్షణకు సిద్ధమవుతున్నారు. చివరకు వారి ఆసక్తి చూసి నిత్యం కుటుంబ సభ్యులే మైదానానికి తీసుకొస్తున్నారు. వారి సాధనకు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తున్నారు. అమ్మాయిలు సైతం క్రమం తప్పకుండా మైదానంబాట పట్టి బ్యాట్, బంతితో ప్రతిభ కనబరుస్తున్నారు. శిక్షకుడి సూచనలు, మెలకువలతో మెరుగ్గా తయారవుతున్నారు.

మక్కువ పెంచుకుని సాధన



జైపూర్ మండలానికి చెందిన ఈమె పేరు సంజన. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. ఏడాది కిందటి వరకు క్రికెట్ అంటే తెలియదు. కానీ గత సంవత్సరం నుంచి ఈ ఆటపై ఆసక్తి పెంచుకుంది. తన తపన చూసి పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు సిరంగి గోపాల్ ప్రోత్సహించడం మొదలు పెట్టారు. శిక్షణ కోసం పాఠశాలలో చిన్నపాటి పిచ్ సిద్ధం చేయించారు. దీంతో అబ్బాయిలతోపాటు సంజన సైతం నిత్యం సాధన చేయడం ప్రారంభించింది. ఇటీవల మంచిర్యాలలోని హెచ్‌సీఏ శిక్షణ కేంద్రానికి వస్తూ మెలకువలను నేర్చుకుంటోంది. శిక్షకుడి సూచనలు శ్రద్ధగా వింటూ బౌలింగ్, బ్యాటింగ్ శైలిని మెరుగుపరుచుకుంటోంది.



అమ్మాయిలకు సూచనలు చేస్తున్న హెచ్‌సీఏ శిక్షణ కేంద్రం శిక్షకుడు ప్రదీప్

పదేళ్లు కూడా లేవు.. బ్యాట్ పట్టేసింది



మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన సమన్వికి పదేళ్లు కూడా లేవు. బ్యాటింగ్, బౌలింగ్ చేస్తోంది. తన పట్టుదల, క్రమశిక్షణతో శిక్షణ కేంద్రంలోని సీనియర్ క్రీడాకారులతోపాటు శిక్షకుడిని సైతం ఆకట్టుకుంటోంది. ఇప్పటికే కరాటేలో అనేక పతకాలు సాధించగా క్రికెట్‌పై ఆసక్తితో నిత్యం మైదానానికి వచ్చి పరుగు పెడుతోంది. శిక్షకుడి సూచనలను పాటిస్తోంది. తండ్రి సహకారానికితోడు కావడంతో ఈ చిన్నారి క్రమం తప్పకుండా మైదానానికి వస్తోంది. మెరుగైన ఆటతీరుతో జాతీయ స్థాయికి చేరుతానంటోంది.

కష్టాలు అధిగమించి.. కొలువులు సాధించి

మామడ, న్యూస్‌టుడే: జీవితం వడ్డించిన విస్తరిలా అన్నీ ఉన్నా కొంత మంది చిన్నపాటి అవరోధాలకే కుంగుబాటుకు గురవుతారు. అమ్మో తనవల్ల కావట్లేదని ప్రగతి సాధించే ప్రయత్నాలను వదులుకుంటారు. ఇంకొందరు ఏమీ లేకున్నా.. పరిస్థితులన్నీ ప్రతికూలంగా ఉన్నా భవిష్యత్తును బంగారు బాట వేసుకునేందుకు శక్తియుక్తులు కూడగట్టుకుంటారు. ఇదిగో ఈ యువకుడికి ఒకప్పుడు కనుచూపుమేరంతా శూన్యంగానే ఉండేది. ఆ చీకటిని పారదోలి జీవితంలో కొత్త వెలుగులు తెచ్చుకునేందుకు వారు పడిన కష్టం స్ఫూర్తిదాయకం.

అసలే పేదరికం.. ఆపై అమ్మానాన్నలు దూరం

మామడ మండలం న్యూసాం గ్రామానికి చెందిన గంగారెడ్డి-భూమవ్వ దంపతులకు సుమన్‌రెడ్డి, సురేష్ రెడ్డి ఇద్దరు సంతానం. కొద్దిపాటి వ్యవసాయం ఉన్నా అంతగా గిట్టుబాటయ్యేది కాదు. నిత్యం కష్టాలమయంగానే ఉండేది. ఈ పరిస్థితుల్లో ఉన్నట్టుండి తండ్రి గంగారెడ్డి మరణించారు. అప్పుడు సుమన్ ఇంటర్ చదువుతున్నారు. సంపాదనకు ఏకైక ఆధారమైన నాన్న కాలం చేయడంతో ఏమీ పాలుపోలేదు. ఇదే తరుణంలో అమ్మ భూమవ్వ మృతి చెందారు.

తమ్ముడే తండ్రయ్యాడు..

అంతా శూన్యంలా మారినా ఆ సోదరులు తడబడలేదు. అన్నా.. నువ్వు బాగా చదువుకో నేను కష్టపడి డబ్బు సంపాదిస్తానంటూ తమ్ముడు సురేష్ ఉపాధి కోసం దుబాయ్ బాట పట్టారు. ఆయన సహకారంతో సుమన్ డిగ్రీ, పీజీ, పోటీ పరీక్షలకు సన్నద్ధమై అన్నీ విజయవంతంగా పూర్తి చేశారు.



తమ్ముడు సురేష్‌తో అన్న సుమన్‌రెడ్డి

● 'మన కష్టాలను మనమే ఎదుర్కోవాలి.. ఉన్నచోటు నుంచి ఉన్నత స్థానానికి వెళ్లాలంటే ప్రణాళిక, పట్టుదల చాలా కీలకం. మన ఇబ్బందులపై ఇతరులు తాత్కాలికంగా సానుభూతి చూపిస్తారు. కానీ మనతో కలిసి నడిచే వారుండరు. ఆత్మవిశ్వాసంతో విజయం వైపు అడుగులు వేయడమే నా విజయానికి కారణమని ఆ యువ గెజిటెడ్ అధికారి సుమన్‌రెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు.'

పీజీలు 'రెండు' బంగారు పతకాలు

సైకాలజీలో డిగ్రీ పూర్తి చేసి పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీలో ఎంఏ ఆంత్రోపాలజీ, లైబ్రరీ, ఇన్ఫర్మేషన్ సైన్స్‌లో పీజీ పూర్తి చేశారు. చదివిన ప్రతిచోట రెండింటిలో బంగారు పతకాలు సాధించారు. యూజీసీ నెట్, తెలంగాణ సెట్ అర్హత సాధించారు.

ఇవీ సాధించిన ఉద్యోగాలు

✦ గురుకులాల్లో పాఠశాల, మాధ్యమిక, డిగ్రీ కళాశాల (2023 సంవత్సరంలో వేర్వేరు నోటిఫికేషన్ల ద్వారా పరీక్షలు రాసి) లైబ్రేరియన్‌గా ఏకకాలంలోనే మూడు ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

✦ కేంద్రీయ విద్యాలయ సంఘటన్ లైబ్రేరియన్ ఉద్యోగానికి 2022 నోటిఫికేషన్‌లో పరీక్ష రాసి ఆ కొలువు సాధించారు. ప్రస్తుతం బెంగళూరు రీజియన్ జలహళ్లి కేంద్రీయ విద్యాలయంలో గ్రంథాలయాధికారిగా విధులు నిర్వర్తిస్తున్నారు.

✦ తాజాగా విడుదలైన పాలిటెక్నిక్ కళాశాల లైబ్రేరియన్ పరీక్ష ఫలితాల్లో రాష్ట్రంలో 8వ ర్యాంకు, బాసర జోన్‌లో మొదటి ర్యాంకుతో ఏకకాలంలోనే తన అయిదో ఉద్యోగాన్ని సాధించారు. సొంతూరుకు చేరువలోనే నిర్మల్ జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో సుమన్ పోస్టింగ్ లభించింది. ఈ కొలువుకు గెజిటెడ్ అధికారి హోదా ఉండటంతో కేంద్రీయ విద్యాలయం ఉద్యోగాన్ని వదులుకున్నారు.


పశువుల కాపరి కుమారుడు అయ్యాడు ఉపాధ్యాయుడు..



జన్నారం, న్యూస్‌టుడే: కడు పేదరికం.. నాన్న పశువుల కాపరిగా పనిచేస్తే వచ్చే కూలీ డబ్బులే వారికి కడుపు నింపేవి. కష్టపడి చదివి నాన్న కష్టాల్లో పాలు పంచుకోవాలని కలలు కన్నాడు. అయితే తానొకటి తలిస్తే దైవం మరోలా చేసింది. ఇంటర్ చదివే సమయంలో తండ్రి మృతి చెందడంతో చదువు ఆగిపోయే పరిస్థితి నెలకొంది. ఎన్నో ఇక్కట్లు అధిగమించి ఇటీవల వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్‌గా ప్రభుత్వ కొలువు సాధించారు.

జన్నారం మండలం మొర్రిగూడ ఎస్సీ కాలనీకి చెందిన సంతపురి చిన్నులు-మల్లవ్వ దంపతుల కుమారుడు సంతపురి అశోక్ జీవశాస్త్రంలో స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించారు. ఇటీవల వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో మంచిర్యాల జిల్లాలో ఓపెన్ కేటగిరిలో 21వ ర్యాంకు సాధించారు. ఎస్సీ విభాగంలో మొదటి ర్యాంకు సొంతం చేసుకున్నాడు. చిన్నప్పటి నుంచే చదువుపై ఇష్టం ఉన్న అశోక్ ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొన్నాడు. ప్రాథమిక విద్య మొర్రిగూడ ప్రభుత్వ పాఠశాలలో, ఆరు నుంచి ఇంటర్ వరకు ఆసిఫాబాద్‌లోని సాంఘిక సంక్షేమ వసతి గృహం, డిగ్రీ నిర్మల్ ప్రభుత్వ కళాశాలలో, పీజీ తెలంగాణ విశ్వవిద్యాలయంలో పూర్తి చేసిన అశోక్ బీఈడీ నిజామాబాద్‌లో చదివారు. ఇంటర్‌లో తండ్రి మృతి చెందడంతో ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితి మరింత దిగజారిపోయింది. చదువు పూర్తి కాగానే 2021లో వెన్నెలతో వివాహమైంది. అన్నయ్యలు శ్రీనివాస్, శంకర్, భార్య వెన్నెల, ఇద్దరు అక్కయ్యలు, చిన్ననాటి మిత్రుల సహకారంతోనే ప్రభుత్వ ఉపాధ్యాయుడి కొలువు సాధించానని, పేద విద్యార్థుల చదువుకు తనవంతు సహకారం అందిస్తానని అశోక్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు. కటిక పేదరికాన్ని జయించి కొలువు సాధించిన అశోక్‌ను కాలనీ వాసులు అభినందించారు.

పులి సంచారం.. భయం భయం!



కెరమెరి, న్యూస్‌టుడే: మండలంలోని పలు ప్రాంతాల్లో పులి సంచారం స్థానికులను కలవరపెడుతోంది. ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో మండలంలోని పరందోలి, కరంజివాడ, లక్మాపూర్, ఇందాపూర్ గ్రామాల శివారు అటవీ ప్రాంతాల్లో పులి సంచరించిన విషయం విదితమే. కాగా ఈ వారంలో మండలంలోని కెరమెరి ఘాట్ అటవీ ప్రాంతాల్లో సంచరిస్తున్నట్లు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అటవీ ప్రాంతంలో ఎలాంటి ఉచ్చులు, విద్యుత్తు తీగలు అమర్చవద్దని, అటవీ సమీప గ్రామాలవాసులు అప్రమత్తంగా ఉండాలని జోడేఘాట్ ఎఫ్ఆర్ఓ జ్ఞానేశ్వర్ సూచించారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

మంచిర్యాల క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఇటీవల రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో సత్తాచాటిన జిల్లా క్రీడాకారిణి జాతీయస్థాయికి ఎంపికయ్యారు. సబ్-జూనియర్స్ విభాగంలో కీర్తి అగర్వాల్ 15 నుంచి హరియాణాలో నిర్వహించే పోటీలకు తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహించనుంది. ఖేలో ఇండియా కేంద్రం శిక్షకుడు రాజేష్ శిక్షణలో ప్రతిభ చాటుతున్న ఆమెను జిల్లా క్రీడాభివృద్ధిశాఖ అధికారి రాజ్‌వీర్ అభినందించారు.



క్రీడాకారిణి కీర్తి అగర్వాల్‌తో శిక్షకుడు రాజేష్

తూర్పు, పశ్చిమ ప్రాంతాలను కలిపేలా..

త్వరలో ఆదిలాబాద్ మీదుగా మూడు కొత్త రైళ్లు



న్యూస్‌టుడే, ఆదిలాబాద్ పట్టణం: ఉమ్మడి ఆదిలాబాద్‌లోని తూర్పు, పశ్చిమ ప్రాంతాలను కలిపేలా మూడు కొత్త రైళ్లు పట్టాలెక్కనున్నాయి. ప్రజలు ఎదురుచూస్తున్న ఈ రైళ్ల కూతలు త్వరలో వినిపించనున్నాయి. కాజీపేట నుంచి మహారాష్ట్రలోని ఇతర ప్రాంతాలకు వెళ్లే ఈ రైళ్లు వయా ఆదిలాబాద్ మీదుగా రాకపోకలు సాగించనుండటంతో ఇరుప్రాంతాలకు ప్రయోజనం చేకూరనుంది. గతంలోనే కాజీపేట-ముంబయికి ఉన్న తాడోబా ఎక్స్‌ప్రెస్ రైలు తూర్పు, పశ్చిమ ప్రాంతాలను కలిపేలా వారానికొకసారి నడిచేది. కరోనా సమయంలో రద్దుచేశారు. తాజాగా ఈ మార్గంలో రైలు మళ్లీ పునరుద్ధరించనున్నారు. మూడు ప్రత్యేక వారాంతపు రైళ్లకు సంబంధించి సమయసారిణి జారీ కావడం శుభపరిణామం. వీటి ప్రారంభానికి సంబంధించి ఉత్తర్వులు జారీ కావాల్సి ఉంది.

✦ కాజీపేట-పుణె ఎక్స్‌ప్రెస్ రైలు వయా పెద్దపల్లి, మంచిర్యాల, కాగజ్‌నగర్ మీదుగా ఉత్తరంవైపున ఉన్న మహారాష్ట్రలోకి ప్రవేశించి బల్లార్ష, మాంజిరి నుంచి తిరిగి పశ్చిమదిశలో తెలంగాణలోకి వచ్చి ఆదిలాబాద్‌కు చేరుకుంటుంది. ఆదిలాబాద్ మీదుగానే మళ్లీ పశ్చిమ ప్రాంతంలోని మహారాష్ట్రవైపున మన్మడ్ చేరుకొని అక్కడి నుంచి నాందేడ్, ఔరంగాబాద్ మీదుగా పుణె వైపు మళ్లుతుంది. వారానికొకసారి నడిచే ఈ రైలు ప్రతి బుధవారం ఉదయం 6.35 గంటలకు పుణె నుంచి ప్రారంభమై గురువారం ఉదయం 6.30 గంటలకు కాజీపేట చేరుకుంటుంది. మధ్యలో ఆదిలాబాద్‌లో రాత్రి 11.45 గంటలకు అందుబాటులో ఉంటుంది. ప్రతి గురువారం ఉదయం 8 గంటలకు కాజీపేట నుంచి బయలుదేరి పుణె వెళుతూ ఆదిలాబాద్‌లో మధ్యాహ్నం 3.15 గంటలకు అందుబాటులో ఉంటుంది. పుణెకు శుక్రవారం రాత్రి 9.45 గంటలకు చేరుకుంటుంది.

✦ కాజీపేట-దాదర్ ప్రత్యేక రైలు(స్పెషల్ రైలు) సైతం మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్‌నగర్ మీదుగా బల్లార్ష, వని, లింగ్టి నుంచి ఆదిలాబాద్‌కు మళ్లుతుంది. తిరిగి మహారాష్ట్రలోని కిన్వట్, నాందేడ్, ఔరంగాబాద్, పుణె మీదుగా దాదర్ రైల్వేస్టేషన్ చేరుకుంటుంది. కాజీపేట నుంచి శనివారం ఉదయం 11.30 గంటలకు బయలుదేరే ఈ రైలు మంచిర్యాలకు మధ్యాహ్నం 12.59 గంటలకు, బెల్లంపల్లిలో మధ్యాహ్నం 1.19 గంటలకు, కాగజ్‌నగర్‌కు 2 గంటలకు, ఆదిలాబాద్‌కు రాత్రి 8.30 గంటలకు చేరి ప్రయాణికులను ఎక్కించుకుంటుంది. దాదర్‌కు ఆదివారం మధ్యాహ్నం 1.25 గంటలకు చేరుతుంది. అదే దాదర్ రైల్వేస్టేషన్ నుంచి ఆదివారం మధ్యాహ్నం 3.25 గంటలకు కాజీపేటకు బయలుదేరే రైలు ఆదిలాబాద్‌లో సోమవారం ఉదయం 11.10 గంటలకు, కాగజ్‌నగర్ స్టేషన్‌లో సాయంత్రం 6.45 గంటలకు, బెల్లంపల్లిలో రాత్రి 7.05 గంటలకు, మంచిర్యాలలో రాత్రి 7.19 గంటలకు చేరి అక్కడి నుంచి సోమవారం రాత్రి 9.30 గంటలకు కాజీపేట గమ్యానికి చేరుతుంది.

✦ కరీంనగర్-పుణె వారానికొకసారి స్పెషల్‌రైలు నడపనున్నారు. ప్రతి బుధవారం కరీంనగర్ నుంచి బయలుదేరి వయా పెద్దపల్లి, మంచిర్యాల, కాగజ్‌నగర్, బల్లార్ష, మాంజిరి, ఆదిలాబాద్ మీదుగా పుణెకు వెళుతుంది. కరీంనగర్ నుంచి ఉదయం 6 గంటలకు బయలుదేరే ఈ రైలు మంచిర్యాలలో ఉదయం 7.16 గంటలకు, కాగజ్‌నగర్‌లో 8.50 గంటలకు, ఆదిలాబాద్‌కు మధ్యాహ్నం 1.45 గంటలకు రైలు ప్రయాణికులకు అందుబాటులో ఉంటుంది. పుణెకు గురువారం ఉదయం 9.45 గంటలకు చేరుకుంటుంది. అదే పుణె రైల్వేస్టేషన్ నుంచి కరీంనగర్‌కు వచ్చే రైలు అక్కడ సోమవారం రాత్రి 10.45 గంటలకు బయలుదేరే రైలు మంగళవారం సాయంత్రం 4 గంటలకు ఆదిలాబాద్‌లో, సిర్పూర్ కాగజ్‌నగర్‌లో రాత్రి 10.48 గంటలకు, మంచిర్యాలకు రాత్రి 11.36 గంటలకు చేరుకుంటుంది.



బాసరలో శోభాయాత్ర

బాసరలో ముగిసిన నవరాత్రి ఉత్సవాలు

బాసర(ముథోల్), న్యూస్‌టుడే: బాసర సరస్వతి అమ్మవారి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. చివరి రోజు అమ్మవారు సరస్వతి రూపంలో దర్శనమిచ్చారు. ఉత్సవాలు ముగియడంతో అమ్మవారికి అభిషేకం చేసిన అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా బాసర గ్రామస్థులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం అమ్మవారికి అశ్వరథంలో గ్రామంలోని ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. ఈ శోభాయాత్రలో గ్రామంలోని మహిళలు, యువతులు నృత్యాలతో స్వాగతం పలికారు.



తనికెళ్ల భరణి మనవడికి అక్షరాభ్యాసం చేయిస్తున్న వేదపండితులు



సరస్వతి అమ్మవారి సన్నిధిలో నిర్మాత దిల్‌రాజు దంపతులు

దర్శించుకున్న ప్రముఖులు

జ్ఞాన సరస్వతిని ఆదివారం సినీనటుడు తనికెళ్ల భరణి దర్శించుకున్నారు. తన మనవడికి అక్షరాభ్యాసం చేయించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నిర్మాత దిల్‌రాజు బాసరలోని వేదభారతి పాఠశాలను సందర్శించి పూజలు చేశారు. అనంతరం ఆలయానికి వచ్చి సరస్వతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం పక్షాన వారిని సన్మానించిన వేదపండితులు తీర్థప్రసాదాలను అందజేశారు.

రూ.54.70 కోట్ల మద్యం తాగేశారు

ఎదులాపురం, న్యూస్‌టుడే: ఈ ఏడాది దసరా సందర్భంగా పక్షం రోజుల్లో ఉమ్మడి జిల్లాలో రూ.54.70 కోట్ల మద్యాన్ని మద్యం ప్రియులు తాగేశారు. గత సంవత్సరం కంటే ఇది రూ.9.15 కోట్లు అధికం. గతేడాది దసరా సందర్భంగా 12 రోజుల్లో రూ.45,54,55,135 మద్యం విక్రయాలు జరగగా ఈ ఏడాది రూ.54,69,95,145 మద్యం అమ్ముడైంది.

ఉమ్మడి జిల్లాలో దసరా సందర్భంగా పక్షం రోజుల్లో జరిగిన అమ్మకాలు జిల్లాల వారీగా (రూ.లలో)

జిల్లా	గతేడాది	ఈ ఏడాది విక్రయాలు
ఆదిలాబాద్	8,23,70,060	11,10,90,368
నిర్మల్	11,03,53,360	12,06,32,027
కుమురంభీం	5,75,21,925	7,62,75,947
మంచిర్యాల	20,52,09,790	23,89,96,803
మొత్తం	**45,54,55,135**	**54,69,95,145**

చేయూతతో.. చేనేతల్లో ఆనందం

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే:

రెక్కల కష్టాన్ని నమ్ముకుని కులవృత్తితోనే ఏళ్ల తరబడి చేనేతలు జీవనం సాగిస్తున్నారు. చేసిన పనికి గిట్టుబాటు ధర లభించనప్పటికీ, మరో పని చేయలేక అదే వృత్తిలో కొనసాగుతున్నారు. సహకార సంఘాలు వారికి కొంత మేరకు తోడ్పాటు అందిస్తున్నాయి. ఇటీవల 'చేనేతకు చేయూత' పథకంలో ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో.. చేనేత కార్మికుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ఈ పథకాన్ని ఇలాగే కొనసాగిస్తే తమ జీవితాల్లో మరిన్ని వెలుగులు నిండుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో రెండు చోట్ల చేనేత సహకార సంఘాలు ఉన్నాయి. మంచిర్యాల జిల్లాలోని చెన్నూరు, కుమురంభీం జిల్లాలోని కాగజ్‌నగర్ మండలం కోసినిలో కొనసాగుతున్నాయి. కోసినిలోని సహకార సంఘం అయిదు దశాబ్దాల కిందట 80 మంది కార్మికులతో ప్రారంభమైంది. ప్రభుత్వ చేయూత కొరవడటంతో ప్రస్తుతం 30 మందికి తగ్గిపోయింది. చెన్నూరులో 1949లో సహకార సంఘం ఏర్పాటు కాగా 40 మంది సభ్యులతో ప్రారంభమైన సంఘం దినదినాభివృద్ధి చెందుతూ 500 మంది కార్మికులతో విజయవంతంగా కొనసాగింది. చెన్నూరుతోపాటు కోటపల్లి, జైపూర్, వేమనపల్లి, నెన్నెల మండలాల కార్మికులు సంఘంలో చేరి వస్త్రాలు నేశారు. అనంతర కాలంలో ఈ రెండింటికీ ప్రభుత్వాల నుంచి సరైన ప్రోత్సాహం లేకపోవడం, నూలు వస్త్రాల దిగుమతిలో ఇబ్బందులు, తదితర కారణాలతో కార్మికుల సంఖ్య గణనీయంగా తగ్గింది. ఒకప్పుడు కార్మికులకు చేతినిండా ఉపాధి కల్పించి అనంతరం ఏర్పడ్డ పరిస్థితులతో వస్త్రాలు నేస్తున్న కార్మికులకు కూలీ గిట్టుబాటు కాకపోవడం, అప్పటి ప్రభుత్వాలు సహకారం లేకపోవడంతో.. చాలా మంది పనిమానేశారు.



కోసిని సొసైటీలో వస్త్రం నేస్తున్న చేనేత కార్మికురాలు

గడువులోపే..

చేనేతలకు ప్రభుత్వం 'చేనేతకు చేయూత' పథకం ప్రారంభించగా.. కార్మికులు 2021లో చేరి నెల నెలా ఆర్డీ రూపంలో నగదు జమ చేశారు. కార్మికుడు ప్రతి నెలా తన ఖాతాల్లో రూ.500 జమ చేస్తే ప్రభుత్వం మరో రూ.వెయ్యి వారి ఖాతాల్లో జమ చేస్తుంది. పథకం 2021 సెప్టెంబర్‌లో ప్రారంభమై 2024 ఆగస్టుతో ముగిసింది. మూడు సంవత్సరాల పాటు కార్మికులు ఆర్డీ రూపంలో జమ చేసిన సొమ్ము ప్రభుత్వం ఇవ్వాల్సిన రెండింతల సొమ్ము కార్మికుల ఖాతాల్లో ఇటీవలే జమ కావడం వారిలో కొంత ఊరటనిచ్చింది. ఈ పథకాన్ని కొనసాగిస్తే తమకు కొండంత అండగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పథకాన్ని కొనసాగించాలి

-నల్ల కనకయ్య, చేనేత సహకార సంఘం కార్యదర్శి, కాగజ్‌నగర్



చేనేతకు చేయూత పథకంలో సొసైటీ కార్మికుల ప్రతి నెలా మూడు సంవత్సరాలపాటు నగదు జమ చేశారు. ఇటీవలే ప్రభుత్వ వాటా కలిపి నిధులు విడుదల చేయడం సంతోషాన్నిచ్చింది. తిరిగి ఈ పథకాన్ని కొనసాగిస్తే కార్మికులకు ప్రోత్సాహాన్ని ఇచ్చినట్టవుతుంది. సంఘాల్లో సభ్యుల సంఖ్య పెరిగి అభివృద్ధి సాధిస్తాయి. కార్మికులకు అమలు చేస్తున్న నేతబీమా పథకం 75 సంవత్సరాల వయసుకు పెంచాలి. చాలా మంది సంఘంలో వృద్ధులు ఉన్నందున బీమా పథకంపై ప్రభుత్వం పునరాలోచించాలి. 2020లో తీసుకున్న ముద్ర రుణాలు మూడేళ్ల పాటు వడ్డీతో కలిపి చెల్లించారు. రుణం మొత్తాన్ని మాఫీ చేయాలి.

తెలంగాణ అథ్లెటిక్స్ జట్టు మేనేజర్‌గా పి.రాజేశ్

ఆదిలాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: చాంద(టి) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీడీగా పని చేస్తున్న పి.రాజేశ్ తెలంగాణ అథ్లెటిక్స్ జట్టు మేనేజర్‌గా ఎంపికయ్యారు. భారత అథ్లెటిక్స్ సమాఖ్య ఈ నెల 17 నుంచి 19 వరకు ఆంధ్రప్రదేశ్ గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహించే 35వ సౌత్‌జోన్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఆయన తెలంగాణ జట్టుకు మేనేజర్‌గా వ్యవహరిస్తారు. జాతీయస్థాయి క్రీడాకారుడిగా రాణించి ఎన్నో పతకాలు సాధించిన ఆయన జిల్లా జట్టుకు తొమ్మిదిసార్లు రాష్ట్రస్థాయిలో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ రావడంలో కీలకపాత్ర పోషించారు. ఆయన ప్రతిభను గుర్తించి తెలంగాణ అథ్లెటిక్స్ సంఘం తెలంగాణ అథ్లెటిక్స్ జట్టుకు మేనేజర్‌గా నియమించింది. ఈ ఘనత సాధించినందుకు జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్షుడు అడ్డి భోజారెడ్డి, జిల్లా క్రీడాధికారులు వేంకటేశ్వర్లు, పార్థసారథి ఆయనకు అభినందనలు తెలిపారు.

PEOPLE CARE
OLD AGE HOME
ఒమేగా హోంకేర్ వంట / ఇంటిపని, వృద్ధులను, పేషెంట్లని, చిన్నపిల్లలను 24 గం|| చూసుకొనుటకు మీ ఇంటి వద్దకే కేర్‌టేకర్స్‌ని పంపబడును. హైదరాబాద్. ✆ 89776 39664, 89776 39665.

JOBS
శ్రీనివాస హోమ్‌కేర్‌లో పెద్దవారికి సేవలు చేయుటకు Exp. స్త్రీ/పురుషులు/ నర్సులు కావలెను. జీతం: 20,000/- నుండి 25,000/- వరకు ఇవ్వబడును. Hyd. లో. ✆ 6301330889, 6300799407.

EENADU Classifieds
Book Your 5 Lines Classified Advertisement for
B & W Rs. 300/- Only
Colour Rs. 350/- Only
GST 5% Applicable in Classifieds on any day
For further details Contact:
Adilabad: 99590 97631 90005 66042

అర్జెంటుగా మూతపడ్డ కంపెనీకి వాచ్‌మెన్లు సూపర్‌వైజర్ & సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. సిర్పూర్ పేపర్ మిల్ ప్రక్కన సర్ సిల్క్ కంపెనీ 'కాగజ్‌నగర్' జీతం: 8000/-ఉచిత గృహ వసతి కుటుంబంతో ఉండవలెను. Email: mktg.sec2011@gmail.com సంప్ర: 9440050036/ 7569783139/ 6300411620

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99590 97631 90005 66042
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80083 42688

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

మేమున్నాం.. మీకు తోడుగా..
(10 AM TO 1 PM)
మంచిర్యాల: 98663 07290
చెన్నూరు: 98496 20143
బెల్లంపల్లి: 99496 20369

మంచిర్యాల పట్టణం, న్యూస్‌టుడే

? మంచిర్యాలలోని సంజీవయ్యకాలనీలో మంచినీటి పైప్‌లైన్ లీకేజీ అవుతుంది. దీంతో తాగునీరు కలుషితం అయ్యే ప్రమాదం ఉంది. పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించండి.
- అయిరిపెల్లి సత్యం, సంజీవయ్యకాలనీ, మంచిర్యాల

✔ రెండు రోజుల్లో పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయిస్తాం.
- మసూద్ అలీ, మున్సిపల్ ఇంజినీరు, మంచిర్యాల

నస్పూర్, న్యూస్‌టుడే:

? శ్రీరాంపూర్‌లోని ఆర్కే-6 ఏరియాలో ఓ మద్యం దుకాణం ముందు జాతీయ రహదారి- 363కి ఇరువైపులా బహిరంగంగా నిత్యం మందుబాబులు మద్యం తాగుతున్నారు. బయటకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. **- స్థానిక మహిళలు, శ్రీరాంపూర్**

✔ ప్రత్యేకదృష్టి సారించి బహిరంగంగా మద్యం తాగకుండా చర్యలు తీసుకుంటాం. **- సంతోష్, శ్రీరాంపూర్ ఎస్సై**

క్రీడా ప్రాంగణం నిరుపయోగం



రెండేళ్ల కిందట మండలంలోని గొర్లపల్లి గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం నిరుపయోగంగా మారింది. బోర్డుకు మాత్రమే క్రీడా మైదానం పరిమితం కాగా మైదానంలో ఎగుడు, దిగుడు గుంతలు, రాళ్లూరప్పలు కన్పిస్తాయి. నాలుగు ఎకరాల స్థలంలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాన్ని చదును చేయలేదు. ఈ విషయమై ఎంపీడీఓ దేవేందర్‌రెడ్డిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా గ్రామ పంచాయతీల్లో నిధుల కొరత ఉందన్నారు. నిధులు మంజూరైన వెంటనే క్రీడాస్థలాన్ని బాగు చేయిస్తామని పేర్కొన్నారు.
- వేమనపల్లి, న్యూస్‌టుడే

అభివృద్ధి చేస్తేనే ఆహ్లాదం

మంచిర్యాల పట్టణం, న్యూస్‌టుడే: మంచిర్యాలలోని రైల్వే ఎత్తు వంతెన కింద పిల్లర్ల మధ్య రెండేళ్ల కిందట రూ.25 లక్షలతో సుందరీకరణ పేరుతో మినీ పార్కులో ఆకర్షణీయ మొక్కలు నాటి జంతువులు, పక్షుల బొమ్మలు ఏర్పాటు చేశారు. కానీ నిర్వహణ లేక అనతి కాలంలోనే మొక్కలు ఎండిపోయాయి. బొమ్మలు చోరీకి గురయ్యాయి. తాజాగా ఆ పార్కు స్థలంలో కొంతమంది తాత్కాలిక షెడ్లు వేసుకున్నారు. అక్కడ అక్రమ షెడ్లు తొలగించి మినీ పార్కును అభివృద్ధి చేసి పట్టణవాసులకు ఆహ్లాదం అందేలా చేయాలని ప్రజలు కోరుతున్నారు.




సాలెగూడెంలో వ్యవసాయ పనులు చేస్తున్న దంపతులు

జొన్న సాగుకు శ్రీకారం

కాసిపేట, న్యూస్‌టుడే: ఆదివాసీ ఆరాధ్య దైవ దేవతలకు పూజించే నైవేద్య పంట జొన్న పంటల సాగుకు ఆదివాసీలు శ్రీకారం చుట్టారు. దసరా పండగ పురస్కరించుకొని కాసిపేట మండలం సాలెగూడెంలోని పెందూర్ భారిక్‌రావు చేనులో పంట క్షేత్రంలో జొన్న పంటల సాగు ప్రారంభించారు. ఏటా ఆదివాసీలు ఎలాంటి పిచికారీ (మందులు) లేకుండా జొన్న పంటలు సాగు చేస్తారు. వర్షాధారం, మంచుతోనే ఈ పంట సాగు చేస్తామని రైతులు చెబుతున్నారు. పంట దిగుబడి వచ్చిన తరువాత ఆదివాసీ దేవతను పూజించి, నైవేద్యం సమర్పిస్తామని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో సింగరేణి కార్మికుడి మృతి

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని కాల్‌టెక్స్ రైల్వే పైవంతెనపై ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రామకృష్ణాపూర్‌కు చెందిన సింగరేణి కార్మికుడు కామిశెట్టి కిరణ్‌కుమార్(50) ద్విచక్రవాహనంపై బెల్లంపల్లి నుంచి రామకృష్ణాపూర్‌కు వెళ్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. కాల్‌టెక్స్ పైవంతెనపై ఫుట్‌పాత్‌ను ఢీకొట్టడంతో చనిపోయాడు. కాసిపేట-2 గనిలో కోల్‌కట్టర్‌గా పనిచేస్తున్నాడు. రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


కిరణ్‌కుమార్

మాజీ ఎమ్మెల్యేకు అస్వస్థత

మందమర్రి పట్టణం, న్యూస్‌టుడే: చెన్నూరు మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు మందమర్రిలోని తన నివాసంలో శనివారం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు ఆయనను మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం ఆయన కోలుకుంటున్నారు. ఆయనను ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామితోపాటు కార్మిక సంఘాల నాయకులు పరామర్శించారు.


ఓదెలును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వివేక్

ఎమ్మెల్యే బొజ్జును కలిసిన సీనియర్ నేత వివేక్

ఉట్నూరు, న్యూస్‌టుడే: కాంగ్రెస్ సీనియర్ నేత, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ ఆదివారం ఉట్నూరులోని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు ఇంటికి వచ్చారు. ఈ సందర్భంగా తొలుత ఎమ్మెల్యే దంపతులు ఆయనకు స్వాగతం పలికి సన్మానించారు. దసరా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇరువురు ఎమ్మెల్యేలు కలిసి కాసేపు మాట్లాడుకున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే వివేక్‌ను సన్మానించారు.


చెన్నూరులోని జాతీయ రహదారిపై బతుకమ్మ ఆడుతున్న మహిళలు, యువతులు

ముగిసిన సద్దుల బతుకమ్మ వేడుకలు

చెన్నూరు, న్యూస్‌టుడే: పట్టణంలో సద్దుల బతుకమ్మ సంబరాలు ఆదివారంతో ముగిశాయి. పట్టణంలో కొన్ని సామాజికవర్గాల మహిళలు 11 రోజులపాటు బతుకమ్మ వేడుకలను నిర్వహిస్తారు. చివరి రోజున తీరొక్క పూలతో బతుకమ్మలను అలంకరించి బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో అంటూ సద్దుల బతుకమ్మ ఆడారు. అర్ధరాత్రి వరకు మహిళలు, యువతులు ఆటపాటలతో హోరెత్తించారు. అనంతరం సమీపంలోని కుంటల్లో, చెరువుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

అంబరాన్నంటిన దసరా సంబరాలు

జిల్లావ్యాప్తంగా దసరా ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన 'రామ్‌లీలా' కార్యక్రమానికి వేలాదిగా జనం తరలిరావడంతో మైదానాలు కిక్కిరిసిపోయాయి. ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామితోపాటు మందమర్రి జీఎం దేవేందర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలోని దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. **- న్యూస్‌టుడే, బృందం**


మాదారంటౌన్‌షిప్‌లో దుర్గాదేవి నిమజ్జన యాత్ర


రావణాసుర బొమ్మను దహనం చేయడానికి బాణం వేస్తున్న ఎమ్మెల్యే వినోద్


జమ్మి చెట్టుకు పూజ చేస్తున్న బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్


మందమర్రిలో ఆయుధ పూజలో పాల్గొన్న సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై రాజశేఖర్


శ్రీరాంపూర్ ఆర్కే-6 గనిలో.. జీఎం సంజీవ రెడ్డి దంపతులు


మందమర్రిలో నృత్యాలు చేస్తున్న చిన్నారులు, కళాకారులు


మందమర్రిలో పల్లకిలో అమ్మవారిని తీసుకు వస్తున్న ఎమ్మెల్యే వివేక్, జీఎం దేవేందర్


బాణం ఎక్కుపెట్టిన కమాండెంట్ వెంకటరాములు దంపతులు


మందమర్రిలో దుర్గామాతను దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు


భీమారంలో జమ్మి చెట్టు వద్ద గ్రామస్థులు


చెన్నూరులోని పూజలు నిర్వహిస్తున్న పుర ఛైర్‌పర్సన్ అర్చనగిల్డా, స్థానికులు


కర్ణమామిడిలో జమ్మి చెట్టు పూజలో పాల్గొన్న గ్రామస్థులు


మంచిర్యాల పోలీస్‌స్టేషన్‌లో ఆయుధ పూజ చేస్తున్న అధికారులు


బెల్లంపల్లిలో కాలిపోతున్న రావణాసుర బొమ్మ


జన్నారం: జమ్మిచెట్టు వద్ద పూజలు చేస్తున్న ప్రజలు

కానరాని వసతులు.. కూలీలకు వెతలు

కాసిపేట, న్యూస్‌టుడే: బతుకు దెరువుకు వస్తున్న వలస కూలీలకు భద్రత కరవవుతోంది. జిల్లా వ్యాప్తంగా పలు పరిశ్రమల్లో పనులు చేసేందుకు వివిధ రాష్ట్రాలకు చెందిన కూలీలను గుత్తేదారులు తీసుకొస్తున్నారు. వీరికి ఉండేందుకు సరైన సౌకర్యాలు కల్పించకుండా ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఈ క్రమంలో గుత్తేదారులు తమ మీదకు రాకుండా ముందస్తుగానే వారిని అంబులెన్స్‌లో ఇంటికి పంపిస్తున్నారు. వలస కూలీలపై కార్మిక శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ భద్రత హైదరాబాద్‌కు చెందిన ఓ గుత్తేదారు సంస్థకు అప్పగించారు. ఒప్పంద పద్ధతిన వివిధ ప్రాంతాలకు చెందిన యువకులను సెక్యూరిటీ గార్డులుగా నియమించుకున్నారు. వీరు ఉండేందుకు అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఓ షెడ్ల నిర్మాణం చేపట్టారు. గత నెల 14న ఆ షెడ్డులో నిద్రిస్తుండగా ఇద్దరు సెక్యూరిటీ గార్డులను పాము కాటేసింది. తిర్యాణికి చెందిన యువకుడు మృతిచెందాడు. మహారాష్ట్రకు చెందిన యువకుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కనీస సౌకర్యాలను కల్పించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

కాసిపేట మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ నిర్మిస్తున్న నూతన క్వాటర్ల నిర్మాణానికి బిహార్, మహారాష్ట్రతో వివిధ రాష్ట్రాలకు చెందిన కూలీలను తీసుకొచ్చారు. సమయ పాలన పాటించకుండా పనులు చేస్తున్నారు. వారు ఉండేందుకు గుత్తేదారు సరైన సౌకర్యాలు కల్పించలేదు. చెట్ల నడుమ చిన్న చిన్న గుడిసెలు నిర్మాణాలు చేపట్టి ఇచ్చారు. పనులు ముగించుకొని వచ్చిన కూలీలకు సరైన సౌకర్యాలు లేక ప్రమాదకర షెడ్లలోనే నిద్రిస్తున్నారు.



సకుటుంబ సపరివారంగా..

వారంతా ఐటీ ఉద్యోగులు.. దసరా పండగ రోజూ కుటుంబ సభ్యులంతా 41 మంది ఒక చోట కలిసి సందడి చేశారు. వివరాల్లోకి వెళ్తే.. నెన్నెల మండల కేంద్రంలోని రత్నం మొండక్కకు ముగ్గురు కూతుళ్లు పద్మ, జయ, స్వరూప, కుమారుడు రాజిరెడ్డి ఉన్నారు. వీరి కుమారులు, కూతుళ్లు, మనుమలు, మనుమరాళ్లు కలిపి 41 మంది ఒక చోట కలిశారు. ఇందులో ఎక్కువ మంది ఐటీ ఉద్యోగులు ఉన్నారు. వీరంతా విజయదశమి రోజు నెన్నెలలోని రత్నం మొండమ్మ ఇంటికి వచ్చి సరదాగా గడిపారు. **- నెన్నెల, న్యూస్‌టుడే**



ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు


చెన్నూరులో అలంకరణలో నిమజ్జనానికి తరలుతున్న దుర్గామాత


చెన్నూరులో దాండియా ఆడుతున్న మహిళల నృత్యాలు


చెన్నూరులో పల్లకిలో దుర్గామాత నిమజ్జన శోభాయాత్రలో బ్రాహ్మణులు


చెన్నూరు జెండా వీధికి చెందిన జైభవాని దుర్గాదేవి శోభాయాత్రలో గుస్సాడీ కళాకారులు


లక్షెట్టిపేటలో గోదావరి రోడ్డులోని సాయిగణేష్ మండపం దుర్గాదేవి నిమజ్జనం సందర్భంగా దేవతల వేషధారణ


చెన్నూరులో..


మంచిర్యాల : మంగళహారతులతో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న మహిళలు


మందమర్రిలో..


మంచిర్యాల: ప్రత్యేక అలంకరణతో భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు


లక్షెట్టిపేటలో ..

జిల్లావ్యాప్తంగా దుర్గాదేవి మండపంలో నవరాత్రులు వైభవోపేతంగా నిర్వహించారు. రోజుకో తీరు పూజలు, హోమాలు, అన్నదానాలు అంగరంగ వైభవంగా జరిపించారు. నిమజ్జనం రోజున కాలనీ మహిళలు భారీగా పాల్గొని అమ్మవారికి మంగళ హారతులతో పూజలు చేశారు. **- న్యూస్‌టుడే, బృందం**


పోతరాజు వేషధారణలో కళాకారుడు


పాతమంచిర్యాలలో..


నెన్నెలలో ..


రామకృష్ణాపూర్‌లో..


మంచిర్యాల: శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు


మంచిర్యాల: గోదావరిలో దుర్గామాత విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న పటాలం పోలీసులు


రెబ్బెనలో...

గుండా మల్లేష్‌కు ఘననివాళి

తాండూరు, న్యూస్‌టుడే: సీపీఐ నేత గుండా మల్లేష్ 4వ వర్ధంతి వేడుకలను ఆదివారం తాండూరు మండల కేంద్రంలోని భగత్‌సింగ్ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు గుండా మల్లేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి బానేష్, సీనియర్ నాయకులు భాస్కర్, రాజేష్, నాగరాజు, శ్రీనివాస్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

గుండా మల్లేష్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

సంక్షిప్తం

నిజాయితీ చాటుకున్న యువకుడు

జన్నారం: మండలంలోని టీజీపల్లి గ్రామానికి చెందిన షేక్ మజార్ తన రూ.15 వేల విలువైన చరవాణిని ఈ నెల 12న మహ్మదాబాద్ వద్ద పోగొట్టుకున్నాడు. చింతగూడ గ్రామానికి చెందిన ఏరుగట్ల వెంకటేశ్ అనే యువకుడికి అది లభించింది. పోలీస్ ఠాణాకు వెళ్లి సదరు వ్యక్తికి చరవాణి అందజేసి నిజాయితీ చాటుకున్నాడు. ఆ యువకుడిని జన్నారం ఎస్సై-2 రాథోడ్ తానాజీ అభినందించారు.

రోడ్డు పనులకు భూమిపూజ

చెన్నూరు: పట్టణంలోని 16వ వార్డులో నూతనంగా నిర్మించతలపెట్టిన సీసీరోడ్డు పనులను శనివారం స్థానిక ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి ప్రారంభించారు. డీఎంఎఫ్‌టీ నిధులు రూ.7.50 లక్షలతో రహదారి నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు.

ఘనంగా ఆర్‌ఎస్‌ఎస్ ఆవిర్భావం

దండేపల్లి గ్రామీణం: ఆర్‌ఎస్‌ఎస్ ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మండలశాఖ ఆధ్వర్యంలో దండేపల్లి, నెల్కివెంకటాపూర్ గ్రామాల్లో ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. భరతమాతకు పూజా కార్యక్రమాలు చేశారు.

భక్తులకు అల్పాహారం

చెన్నూరు: చెన్నూరు పట్టణంలో దుర్గాదేవి నిమజ్జన శోభాయాత్రలో పాల్గొన్న భక్తులకు పట్టణానికి చెందిన చకినారపు భూమయ్య జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు స్థానిక గోదావరి రోడ్డు మార్గంలో అల్పాహారాన్ని అందజేశారు.

పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీరాములు

తాండూరు: పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడిగా తాండూరు మండలానికి చెందిన మాసాడి శ్రీరాములు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా జయప్రద, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా వెంకటేశ్వరరావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ప్రదీప్‌లు ఎన్నికయ్యారు. మంచిర్యాల జిల్లా అధ్యక్షులు ఇన్నారెడ్డి, ప్రధాన కార్యదర్శి రవి వారికి అభినందనలు తెలిపారు.

జెండా పండగ

నెన్నెల : గొల్లపల్లి గ్రామంలో గ్రామస్థులు విజయదశమి సందర్భంగా జెండా పండగ నిర్వహించారు. గ్రామపెద్ద ఇందూరి రమేష్ మాట్లాడుతూ గ్రామంలో శాంతి పాడి పంటలు బాగా పండాలని సనాతనంగా వస్తున్న వేడుక అని చెప్పారు. గ్రామంలో ఊరేగింపు నిర్వహించి జెండా ఆవిష్కరించినట్లు తెలిపారు.

మంచిర్యాలలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట బుద్ధ వందనం చేస్తున్న బహుజన సంఘాల నాయకులు

అంబేడ్కర్ విగ్రహం ఎదుట బుద్ధ వందనం

మంచిర్యాల పట్టణం: అశోక విజయదశమి పురస్కరించుకొని మంచిర్యాలలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట బహుజన సంఘాల నాయకులు శనివారం బుద్ధ వందన కార్యక్రమం నిర్వహించి, పంచశీల జెండాను ఆవిష్కరించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. భారతీయ బౌద్ధ సభ, నేతకాని మహార్ సేవా సంఘం, బహుజన సంఘాల నాయకులు దుర్గం సిద్ధార్త రాంమూర్తి, భూమన్న, సాయి, ప్రేమ్‌కుమార్, జాడి అర్చన, దుర్గం స్వామి పాల్గొన్నారు.

(c) eenadu